క్లుప్తంగా

వైద్య శిబిరాలు

కడియం: సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్న నేపథ్యంలో బుర్రిలంక, మురమండ గ్రామాల్లో శనివారం వైద్య శిబిరాలను నిర్వహించారు. కడియపులంక పంచాయతీ పరిధిలోని బుర్రిలంకలో 36 మందికి వైద్య పరీక్షలు జరిపారు. జ్వరంతో ఉన్న ఇద్దరికి డెంగీ, మలేరియా పరీక్షలు నిర్వహించారు. మురమండ ఎస్సీ పేట కమ్యూనిటీ హాలు వద్ద 43 మందిని పరీక్షించి, ముగ్గురికి డెంగీ, మలేరియా పరీక్షలు చేశారు. వీరందరికి నెగటివ్ ఫలితాలు వచ్చాయి. శిబిరాలలో వైద్యాధికారులు ఎస్.జెస్సీ సుప్రియ, జి.స్వరూప వైద్యసేవలు అందించారు. ఎంఎల్‌హెచ్‌పీలు, హెల్త్ అసిస్టెంట్లు, ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

వైభవంగా దుర్గమ్మ పడిపూజ



పడిపూజలో పాల్గొన్న భవానీలు, భక్తులు

కడియం: కడియపులంకలో శుక్రవారం రాత్రి దుర్గమ్మ పడిపూజ వైభవంగా జరిగింది. సత్యదేవ నర్సరీ మేనేజింగ్ డైరెక్టర్ పుల్లా వీర వెంకట్రావు కుమారుడు పుల్లా శ్రీకాంత్ అమ్మవారి మాలధారణను పురస్కరించుకుని ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున భవాని మాలధారులు పాల్గొన్నారు. పంతం గంగారావు, తాడాల వీర వెంకట్రావు గురుస్వాముల చేతుల మీదుగా మాలధారులను సత్కరించారు. నర్సరీ రంగ ప్రముఖులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

అగ్ని బాధితులకు సాయం

కడియం: ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంలో స్థానిక పోలీస్ స్టేషన్ పక్కన ఇటీవల రెండు ఇళ్ల కాలిపోయాయి. ఈ సందర్భంగా బాధిత కుటుంబాలను జనసేన నాయకుడు చిరుకూరి నాగేశ్వరరావు తదితరులు పరామర్శించి శనివారం సాయం అందజేశారు.

విశ్వకర్మ పథకంతో ఎంతో ప్రయోజనం

సీటీఆర్ఐ: చేతి వృత్తుల వారికి పీఎం విశ్వకర్మ పథకం వల్ల ఎంతో ప్రయోజనం కలుగుతుందని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి గంటా సుధాకర్ అన్నారు. సీతంపేటలోని మాతాశ్రీ కళాశాల ప్రాంగణంలో చేతి వృత్తులవారికి పీఎం విశ్వకర్మ ద్వారా నిర్వహిస్తున్న శిక్షణ తరగతులను శనివారం ఆయన తనిఖీ చేశారు. కార్పెంటర్ శిక్షణ తరగతులు జరుగుతున్న విధానంపై ఆరా తీశారు. శిక్షణ అనంతరం యూనిట్లు నెలకొల్పటానికి కావాల్సిన సమాచారం తెలిపారు. కార్యక్రమంలో శ్రీటెక్నాలజీస్ సంస్థ ప్రతినిధులు, సిబ్బంది పాల్గొన్నారు.

సచివాలయాల్లో ఉద్యోగుల చేరిక

రాజమహేంద్రవరం రూరల్: మండలంలోని పలువురు విలేజ్ సర్వేయర్లు శనివారం బాధ్యతలు స్వీకరించారు. తొర్రేడు సచివాలయం-2లో యు.శ్రీనివాస్, పిడింగొయ్యి-2లో జి.వి నాయక పురుషోత్తం నాయుడు, బొమ్మూరు-1లో మలిశెట్టి జయశంకర్, బొమ్మూరు-4లో శీలం వీరబాబు, కోలమూరు -3లో చానాపతి హరీష్, కోలమూరు -4లో తిరుశల చిన బాబు, కోలమూరు -1లో జామి ప్రశాంత్ కుమార్‌లు బాధ్యతలు స్వీకరించారు. అలాగే శాటిలైట్ సిటీ -1లో డిజిటల్ అసిస్టెంట్ జులువ నీలిమ బాధ్యతలు చేపట్టారు. వీరందరూ ముందుగా ఎంపీడీవో డి.శ్రీనివాసరావును మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు.

మోటారు సైకిళ్ల దొంగ అరెస్టు



పోలీసులు స్వాధీనం చేసుకున్న మోటారు సైకిళ్లు

కంబాలచెరువు: మోటారు సైకిళ్ల దొంగను రాజమహేంద్రవరం ఒకటో పట్టణ పోలీసులు శనివారం అరెస్టు చేశారు. అతడి నుంచి రూ.9.98 లక్షల విలువైన 22 మోటారు సైకిళ్లు స్వాధీనం చేసుకున్నారు. ఎస్పీ ఆదేశాల మేరకు సెంట్రల్ జోన్ డీఎస్పీ రమేష్ బాబు ఆధ్వర్యంలో ఒకటో పట్టణ సీఐ మురళీకృష్ణ ఊర్వశి థియేటర్ వద్ద వాహన తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఆ సమయంలో కృష్ణాజిల్లా పామర్రు మండలం మల్లవరం గ్రామానికి చెందిన చుండూరు రమేష్ బాబు కూరగాయలు మార్కెట్ నుంచి ఊర్వశి సినిమా థియేటర్ వైపు యాక్టివా మోటారు సైకిల్‌పై వస్తున్నాడు. అతడిని పోలీసులు ఆపి వాహన తనిఖీ చేసే ప్రక్రియలో రమేష్‌బాబు పారిపోయేందుకు ప్రయత్నించాడు. వెంటనే ఎస్సై జె.ఆదినారాయణ, పోలీసు సిబ్బంది పట్టుకున్నారు. రమేష్‌బాబును విచారించగా పలు మోటారు సైకిళ్ల దొంగతనాలు బయటపడ్డాయి. గడచిన 8 నెలల కాలంలో భీమవరం వన్‌టౌన్, ఆగిరిపల్లి, విజయవాడ, ద్వారకా తిరుమల, ఏలూరు, పెదవేగి, నల్లజర్ల, వీరవల్లి, జగ్గంపేట పోలీస్ స్టేషన్‌ల పరిధిలో ఇళ్ల బయట పార్కింగ్ చేసిన మోటారు సైకిళ్లను దొంగతనం చేసినట్లు ఒప్పుకున్నాడు. నిందుతుడిని పట్టుకుని దొంగసొత్తును రికవరీ చేయడంలో కృషి చేసిన సీఐ మురళీకృష్ణ, ఎస్సై ఆదినారాయణ, హెడ్ కానిస్టేబుల్ కె.సురేష్, కానిస్టేబుళ్లు గణేష్, మహేష్, రబ్బాని, శ్రీను, వెంకటేష్‌ను డీఎస్పీ రమేష్ బాబు అభినందించారు.

రోడ్డు దాటాలంటే దడే..

- ప్రమాదకరంగా ధవళేశ్వరం ఇండస్ట్రియల్ కాలనీ వద్ద మలుపు
- జాతీయ రహదారిని దాటడానికి అవస్థలు
- తరచూ ప్రమాదాలు
- ఫ్లైఓవర్ వేయాలని కోరుతున్న స్థానికులు



జాతీయ రహదారి దాటడానికి ఇబ్బంది పడుతున్న వాహన చోదకులు



ఇండస్ట్రియల్ కాలనీ డివైడర్ వద్ద ఉన్న ప్రమాదకరంగా ఉన్న మలుపు

ధవళేశ్వరం: రోడ్డు దాటాలంటే గండమే, ఎప్పుడు ఏ విధంగా ప్రమాదాలు జరుగుతాయోనని స్థానికులు, వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జాతీయ రహదారిపై ఇండస్ట్రియల్ కాలనీ నుంచి ధవళేశ్వరం వైపునకు వచ్చే డివైడర్ మలుపు వద్ద తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇక్కడ జీబ్రా లైన్లు ఏర్పాటు చేసి వేగాన్ని నియంత్రించే బోర్డులు పెట్టినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. ఈ రోడ్డులో వేమగిరి వైపు వెళ్లే వాహనాలు వేగంగా దూసుకుపోతున్నాయి. అదే సమయంలో ధవళేశ్వరం వైపు తిరిగే వాహనాలను ఇవి ఢీకొట్టడంతో ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి.

ఏడాదిలో 50 ప్రమాదాలు

జాతీయ రహదారిపై ఉన్న ఈ జంక్షన్ అత్యంత ప్రమాదకరంగా మారింది. తరచూ ఏదో ఒక ప్రమాదం జరుగుతూనే ఉంటోంది. ఎన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నా ప్రమాదాల తీవ్రత మాత్రం తగ్గడం లేదు. ఏడాది కాలంలో సుమారు 50కి పైగా ప్రమాదాలు ఈ ప్రాంతంలో జరిగాయి. దీన్ని బట్టి ఈ జంక్షన్ ఎంత ప్రమాదకరంగా మారిందో తెలుసుకోవచ్చు.

నిత్యం రాకపోకలు

ఈ జంక్షన్ మీదుగా అనేక మంది నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. ధవళేశ్వరంలోని హార్లిక్స్ ఫ్యాక్టరీతో పాటు పలు పరిశ్రమల కార్మికులు జాతీయ రహదారి మీదుగా ధవళేశ్వరం వైపు వచ్చేందుకు ఇదే ప్రధాన మార్గం. కార్మికులకు మూడు షిఫ్టులలో డ్యూటీలు ఉండటంతో రాత్రి, తెల్లవారుజాము ప్రాంతాల్లో ఈ మార్గం మీదుగా ప్రయాణిస్తారు. ఇది డేంజర్ జంక్షన్‌గా మారడంతో వారందరూ తీవ్ర భయాందోళనలు చెందుతున్నారు. ఇక్కడ లైటింగ్ సక్రమంగా లేకపోవడంతో రాత్రి సమయంలో ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నాయి. అదే విధంగా ఇక్కడ వెలుతురు కూడా సరిగ్గా లేకపోవడంతో రాత్రి సమయాల్లో ప్రమాదాలు జరుగుతున్నాయి.

సాహసమే..

నిత్యం వేల మంది రాకపోకలు సాగించే ఈ ప్రాంతంలో జాతీయ రహదారి నుంచి ధవళేశ్వరం గ్రామం వైపు రావాలంటే సాహసం చేయాల్సి వస్తోంది. దీనిని దృష్టిలో ఉంచుకుని ఇండస్ట్రియల్ సెంటర్ వద్ద జాతీయ రహదారిపై ఫ్లైఓవర్ నిర్మించాలని స్థానికులు, వాహన చోదకులు కోరుతున్నారు. అప్పుడే పరిశ్రమల్లో పనిచేసే కార్మికులు, ధవళేశ్వరం వాసులు రాకపోకలు సాగించడానికి ఇబ్బందులు తప్పుతాయన్నారు. దీనిపై ప్రజాప్రతినిధులు దృష్టి సారించాలని గ్రామస్తులు కోరుతున్నారు. అలాగే తాత్కాలికంగా ప్రమాదాలను నివారించేందుకు ట్రాఫిక్ పోలీసులను ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు. రాత్రి సమయాల్లో కూడా ఈ ప్రాంతంలో ఎక్కువ కాంతి వచ్చే దీపాలను ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

ఫ్లైఓవర్ నిర్మించాలి



ఇండస్ట్రియల్ కాలనీ సెంటర్‌లో డివైడర్ మలుపు వద్ద తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. వాటి నివారణకు ఇక్కడ ఫ్లైఓవర్ నిర్మించాలి. దానివల్ల ఫ్యాక్టరీ కార్మికులతో పాటు ధవళేశ్వరం గ్రామస్తులకు మేలు జరుగుతుంది. ప్రమాదాలు జరిగే అవకాశం ఉండదు.

– చొల్లంగి సత్యగిరి, ధవళేశ్వరం

చర్యలు తీసుకోవాలి



ఇండస్ట్రియల్ కాలనీ డివైడర్ మలుపు వద్ద ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలి. ఈ ప్రాంతంలో నిత్యం లైట్లు వెలిగే విధంగా ఏర్పాట్లు చేయాలి. ప్రమాదాలను తగ్గించే విధంగా డివైడర్ మలుపు వద్ద ట్రాఫిక్ పోలీసులను నియమించాలి.

– గోలి దేవకుమార్, ధవళేశ్వరం

వృద్ధులకు పింఛన్ల పంపిణీ అభినందనీయం



పింఛన్లు పంపిణీ చేస్తున్న క్లబ్ సభ్యులు

సీటీఆర్ఐ: వృద్ధులకు ప్రతి నెలా పింఛన్లు పంపిణీ చేయడం అభినందనీయమని వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ కార్యదర్శి మార్తి నాగేశ్వరరావు అన్నారు. స్థానిక ఎస్‌కేవీటీలోని ఆనంద గార్డెన్స్‌లో వాకర్స్ యోగా, లాఫింగ్ క్లబ్ ఆధ్వర్యంలో శనివారం వృద్ధులకు పింఛన్లు పంపిణీ చేశారు. క్లబ్ అధ్యక్షుడు శనపతి సత్తిబాబు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ 14 ఏళ్లగా వృద్ధులకు పింఛన్లు, విద్యార్థులకు ఉపకార వేతనాలు అందిస్తూ ఉండడం అభినందనీయమన్నారు. సత్తిబాబు మాట్లాడుతూ 80 మంది వృద్ధులకు రూ.500 చొప్పున రూ.40 వేలు పంపిణీ చేశామన్నారు. అలాగే ఏడిద శ్రీనివాసరావు కుటుంబ సభ్యులు చీరలు, పంచెలు అందించారన్నారు. కార్యక్రమంలో క్లబ్ వ్యవస్థాపకుడు పామర్తి గోపాలరావు, రొక్కం అప్పారావు, ర్యాలి ఉమామహేశ్వరరావు, గీసాల బాబూజీ పాల్గొన్నారు.

సిట్‌కు అందరూ సహకరించాలి



కానుబోయిన సాగర్

రాజమహేంద్రవరం సిటీ: తిరుమల లడ్డూ విషయంలో సుప్రీంకోర్టు నియమించిన ప్రత్యేక సిట్‌కు సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, టీటీడీ ఈవోతో సహా అధికారులందరూ పూర్తిగా సహకరించాలని ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక అభివృద్ధి సంస్థ మాజీ స్టేట్ డైరెక్టర్ కానుబోయిన సాగర్ అన్నారు. ఈ మేరకు శనివారం రాజమహేంద్రవరంలోని తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. సిట్‌కు అందరూ సహకరించినప్పుడే నిజాలు బయటకు వస్తాయన్నారు. పవిత్రమైన తిరుపతి లడ్డూ విషయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు తీరు అనైతికమన్నారు. కోట్లాది మంది హిందువుల మనోభావాలను దెబ్బతీసేలా ఆయన వ్యాఖ్యలు చేశారన్నారు. పవిత్ర మైన ప్రసాదం విషయంలో ఆరోపణలు దారుణమన్నారు. తప్పు చేసిన వారెవ్వరూ తప్పించుకోలేరన్నారు. దానికి నిదర్శనంగానే ఈ రోజు ప్రత్యేక సిట్ నియామకం జరిగిందన్నారు. భక్తుల మనోభావాలు దెబ్బతినకుండా సిటీ నిజాయితీగా నివేదిక అందిస్తుందని భక్తులు నమ్ముతున్నారన్నారు. త్వరితగతిన విచారణ నిర్వహించి నివేదిక అందజేయాలని కోరారు.

కొనసాగిన ఏపీ అథ్లెటిక్స్ పోటీలు

ప్రకాశం నగర్: ఆర్ట్స్ కళాశాల మైదానంలో ఏపీ ఇంటర్ డిస్ట్రిక్ జూనియర్ అథ్లెటిక్స్ ఛాంపియన్ షిప్ పోటీలు రెండో రోజు శనివారం కొనసాగాయి. జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ పోటీలు నిర్వహిస్తున్నారు. అండర్-14, 16, 18, 20 విభాగాల్లో సెమీఫైనల్స్ జరుగుతున్నాయి. దాదాపు 17 జిల్లాల నుంచి ఈ పోటీలకు క్రీడాకారులు హాజరయ్యారు. ఆదివారం జరిగే ఫైనల్స్ అనంతరం విజేతలకు బహుమతులు అందజేయనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. విజేతలుగా నిలిచిన వారు ఈ నెల 16, 17, 18 తేదీల్లో గుంటూరులో జరిగే సౌత్ జోన్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌కు అర్హత సాధిస్తారన్నారు. కాగా.. పలు జిల్లాల నుంచి వచ్చిన క్రీడాకారులకు రెండు కిలోమీటర్ల దూరంలోని ఎస్‌కేవీటీ కళాశాలలో భోజనం ఏర్పాట్లు చేయడంతో ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

భార్యాభర్తలకు గాయాలు

ధవళేశ్వరం: కారు ఢీకొన్న ఘటనలో ద్విచక్ర వాహనంపై వెళుతున్న భార్యాభర్తలు గాయపడ్డారు. ధవళేశ్వరం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శాటిలైట్ సిటీకి చెందిన రేకాడి శ్రీనివాసరావు, ఏసుమణి ఈ నెల 3వ తేదీన ద్విచక్ర వాహనంపై వాడపల్లి గుడికి వెళ్లి తిరిగి వస్తున్నారు. ధవళేశ్వరంలోని కాటన్ బ్యారేజీ వద్ద వారిని వెనుక నుంచి కారు ఢీకొంది. గాయాలైపాలైన వీరిని స్థానికులు రాజమహేంద్రవరంలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ఏసుమణి ఫిర్యాదు మేరకు ధవళేశ్వరం పోలీసులు కేసు నమోదు చేశారు.

8 కాసుల బంగారు ఆభరణాల చోరీ



ఘటనా స్థలంలో ఆధారాలు సేకరిస్తున్న క్లూస్ టీమ్

ధవళేశ్వరం: స్థానిక పోలీస్‌స్టేషన్ వీధిలోని కిరాణా వ్యాపారి గ్రంధి తాతారావు ఇంట్లో 8 కాసుల బంగారు ఆభరణాలు, రూ.25 వేలను దొంగలు దోచుకున్నారు. ఈ ఘటనకు సంబంధించి ధవళేశ్వరం పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కిరాణా షాపులో అమ్మకాల అనంతరం శుక్రవారం రాత్రి రూ.25 వేలు, 8 కాసుల నల్లపూసల తాడు, బంగారం హారం, చేతి ఉంగరం, గొలుసు బ్యాగులో దాచారు. ఆ బ్యాగును, సెల్‌ఫోన్‌ను పైఅంతస్తులో బీరువాలో పెట్టారు. దానికి తాళం వేసి, ఆ తాళాన్ని అలమరలో పెట్టి నిద్రించారు. అర్ధరాత్రి సమయంలో తాతారావు కాలికు ఎవరో తగలడంతో లేచి చూసేసరికి.. దొంగ పరిగెడుతూ కనిపించాడు. వెంటనే బీరువాలో చూడగా బంగారు ఆభరణాలు, నగదు, సెల్‌ఫోన్ కనిపించలేదు. బాధితుడి ఫిర్యాదు మేరకు ధవళేశ్వరం పోలీసులు కేసు నమోదు చేశారు. క్లూస్ టీమ్ ఘటనా స్థలంలో ఆధారాలను సేకరించింది. ధవళేశ్వరం సీఐ టి.గణేష్ ఆధ్వర్యంలో పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కార్యకర్తలకు అండగా జక్కంపూడి కుటుంబం

- ఘనంగా జక్కంపూడి రాజా పుట్టినరోజు వేడుకలు
- కేక్ కట్ చేసిన వైఎస్సార్ సీపీ శ్రేణులు



జక్కంపూడి రాజా పుట్టినరోజు సందర్భంగా కేక్ కట్ చేస్తున్న షర్మిలారెడ్డి తదితరులు



శిబిరంలో రక్త దానం చేస్తున్న అభిమానులు

రాజమహేంద్రవరం సిటీ: కార్యకర్తలకు ఏ కష్టం వచ్చినా జక్కంపూడి కుటుంబం అండగా నిలుస్తుందని, అందుకే వారిపై అందరూ అభిమానం చూపిస్తారని వైఎస్సార్ సీపీ నాయకుడు అడపా అనిల్ కుమార్ అన్నారు. వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు, రాజానగరం మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా పుట్టినరోజు వేడుకలను శనివారం స్థానిక ప్రకాశం నగర్‌లోని రాజా ఇంటి వద్ద అడపా అనిల్, కోడి కోట, రూరల్ నాయకుడు నాళం రోషయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర గృహ నిర్మాణాభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ మేడపాటి షర్మిలారెడ్డి హాజరయ్యారు. పుట్టిన రోజు కేక్‌ను కట్ చేసి అభిమానులకు పంచిపెట్టారు. ఈ సందర్భంగా అడపా అనిల్ కుమార్ మాట్లాడుతూ జక్కంపూడి కుటుంబం అంటే కార్యకర్తలకు ఒక ధైర్యం అన్నారు. వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడిగా జక్కంపూడి రాజా నాయకత్వంలో పార్టీ పూర్వ వైభవానికి కృషి చేస్తామన్నారు.

మెగా రక్తదాన శిబిరం

మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా పుట్టినరోజును పురస్కరించుకుని తాడితోట కన్వెన్షన్ హాలులో లయన్స్ క్లబ్ రాజమహేంద్రవరం, డాక్టర్ వైఎస్సార్ జక్కంపూడి మెమోరియల్ బ్లడ్ సెంటర్ సంయుక్త ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షుడు లయన్ మద్దుల వీఎస్ శ్రీరామగుప్తా మాట్లాడుతూ ఆపదలో ఉన్నవారి ప్రాణాలను కాపాడే శక్తి రక్త దానానికి ఉందన్నారు. రక్తదాతలను అందరూ ప్రోత్సహించాలన్నారు. ఈ కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి లయన్ వెన్నా కుమారస్వామి, ప్రాజెక్ట్ చైర్మన్ లయన్ గ్రంధి వసంత కుమారి పాల్గొన్నారు. కొమ్ముల సూర్య ఆధ్వర్యంలో జక్కంపూడి యూత్ సర్కిల్ సభ్యులు సుమారు 120 మంది స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. అనంతరం కొమ్ముల సాయి చేతుల మీదగా కేక్ కట్ చేశారు.

అడవులు కాదు.. ఆఫీసులేనండీ

రాజమహేంద్రవరం రూరల్ : పలు ప్రభుత్వ కార్యాలయాలు చిట్టడవులను తలపిస్తున్నాయి. ధవళేశ్వరం పంచాయతీ పరిధిలోని మహిళా ప్రాంగణం ఆవరణలో ఉన్న ఐసీడీఎస్, డీఎంఅండ్‌హెచ్‌వో కార్యాలయం వెనుక భాగంలో భారీగా పిచ్చిమొక్కలు పెరిగిపోయాయి. చిన్న సైజు అడవుల్లా ఇవి మారాయి. వాటిలో విష సర్పాలు సంచరిస్తుండడంతో ఉద్యోగులు భయాందోళన చెందుతున్నారు. అలాగే రూరల్ తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో తహసీల్దార్ గది వెనుక, కార్యాలయ స్టాఫ్ వెనుక స్థలంలో, తహసీల్దార్ కార్యాలయం ముందు ఖాళీ స్థలంలో మొక్కలు విపరీతంగా పెరిగిపోయాయి. తహసీల్దార్ కార్యాలయం వెనుక ఉన్న కాలనీలో ఇటీవల ఒక మహిళను పాము కాటేసింది. దీంతో ఉద్యోగులు మరింత భయాందోళనకు గురవుతున్నారు. తహసీల్దార్ కార్యాలయానికి దారి చూపించే బోర్డును సైతం పిచ్చి మొక్కలు కమ్మేశాయి.



డీఎంఅండ్‌హెచ్‌వో, ఐసీడీఎస్ కార్యాలయాల వెనుక పెరిగిన పిచ్చిమొక్కలు



తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది గది వెనుక భాగంలో..



తహసీల్దార్ గది వెనుక పెరిగిన తుప్పలు



తహసీల్దార్ కార్యాలయం దారి చూపే బోర్డు పరిస్థితి

అన్నపూర్ణగా అమ్మవారు

సీటీఆర్ఐ: దసరా శరవన్నరాత్ర మహోత్సవాలలో భాగంగా మూడో రోజు అన్నపూర్ణాదేవీగా దుర్గమ్మ భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిగాయి. పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. దేవీచౌక్‌లో నిర్వహిస్తున్న 91వ దసరా మహోత్సవాల సందర్భంగా బాలాత్రిపుర సుందరిదేవిని అన్నపూర్ణగా అలంకరించారు. ఉమామార్కండేయేశ్వరస్వామి దేవాలయాలంలో అమ్మవారు గాయత్రిగా దర్శనమిచ్చారు. ఉదయం నుంచే కుంకుమ పూజలు నిర్వహించారు. దేవదాయశాఖ అధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు చేశారు.

- వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారిని పేలాలతో అలంకరించారు. సరస్వతీఘాట్, సారంగధరేశ్వరస్వామి ఆలయం, కోటిలింగాలక్షేత్రంలోని శంకర మఠంలోని అమ్మవార్లు వివిధ రూపాలలో దర్శనమిచ్చారు.
- జగన్మాత కనకదుర్గమ్మ కరుణ రాష్ట్ర ప్రజలందరిపైనా ఉండాలని వైఎస్సార్ సీపీ రూరల్ మాజీ కోఆర్డినేటర్ చందన నాగేశ్వర్ అన్నారు. దేవీచౌక్‌లోని అమ్మవారికి శనివారం కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు.



దేవీచౌక్‌లో అమ్మవారిని దర్శించుకుంటున్న చందన రమేష్, నాగేశ్వర్

రాజమహేంద్రవరం రూరల్: మోరంపూడి సాయినగర్‌లోని విజయ కనకదుర్గాదేవి ఆలయంలో అమ్మవారిని శనివారం అన్నపూర్ణదేవిగా అలంకరించినట్లు ఆలయ ధర్మకర్త మేడి త్రిమూర్తులు తెలిపారు. ఆలయ గౌరవాధ్యక్షులు పిల్లి శ్రీను నేతృత్వంలో కుంకుమ పూజలు నిర్వహించారు.

- బాలాజీపేటలోని విజయ కనకదుర్గాదేవి ఆలయంలో అమ్మవారు అన్నపూర్ణాదేవీగా దర్శనమిచ్చారు. ప్రముఖ న్యాయవాది గొందేశి శ్రీనివాసులు రెడ్డి, వాసంశెట్టి సూర్యగణేష్, తలారి శ్రీనివాసరావు, సూరంపూడి ప్రకాష్ పాల్గొన్నారు.



ఉమామార్కండేయేశ్వర స్వామి ఆలయంలో గాయత్రీదేవి



వాసవీమాతకు పేలాలతో అలంకరణ



మోరంపూడి సాయినగర్‌లో అమ్మవారు



బాలాజీపేట విజయ కనక దుర్గాదేవి ఆలయంలో..